## క్లుప్తంగా

### రీసర్వేతో భూవివాదాల పరిష్కారం



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల సమగ్ర సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ మోహన్‌దాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బురుజుల గ్రామంలో రీసర్వే పనులు ప్రారంభించిన అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ భూసమస్యలతో నిత్యం రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు తమ పొలాల సరిహద్దులకు సంబంధించి ధ్రువపత్రాలు సమర్పించి సర్వేకు సహకరించాలని కోరారు. తహసీల్దార్ నాగభూషణం, డీటీ నాగరాజు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ విద్యార్థినుల ప్రతిభ

కృష్ణగిరి: జిల్లా కేంద్రంలోని సిల్వర్ జుబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన యువజన ఉత్సవాల సందర్భంగా కృష్ణగిరి మోడల్ స్కూల్ విద్యార్థినులు తమ కళా ప్రతిభ చాటారు. సాంస్కృతిక నృత్య పోటీలలో జానపద నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాకారులైన తమ విద్యార్థినులు సమీర, మేఘన, సుజాత, రోజాబీ, పూజిత, అనితలను మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ నిర్మల, ఉపాధ్యాయ, సిబ్బంది అభినందించారు.

### రైతులను ఆదుకోవాలి



పత్తికొండలో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ రూరల్: తీవ్ర వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని మంగళవారం సీపీఐ, ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రామచంద్రయ్య మాట్లాడుతూ.. ఈ ఏడాది సరైన వర్షాలు లేక రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు రాజాసాహెబ్, కారన్న, కారుమంచి, నెట్టికంటయ్య తదితరులు పాల్గొన్నారు.

### గట్టు ఉత్సవాల నిర్వహణపై 30న సమావేశం

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన శ్రీ మాళమల్లేశ్వర స్వామి దసరా ఉత్సవాలు అక్టోబర్ 19 నుంచి 28వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు తెలిపారు. ఆయన మంగళవారం ఆలూరులోని తన నివాసంలో మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో ఈ నెల 30వ తేదీన ఆలూరులో ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ గ్రామాల పెద్దలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వైద్య, పీఆర్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు హాజరు కావాలని కోరారు. ఉత్సవాలకు అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం కల్పించనున్న ఏర్పాట్లపై చర్చిస్తామన్నారు.

### కోడి పందేలపై దాడులు

కృష్ణగిరి: మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామ శివారు ఎల్లమ్మ గుడి వద్ద జరుగుతున్న కోడి పందేలపై ఎస్‌ఐ సురేశ్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. దాడులలో కోళ్ల పందెం ఆడుతూ ఆరుగురు పట్టుబడినట్లు, ముగ్గురు పారిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడ్డ వారి వద్ద నుంచి రూ.4500లు, రెండు నాటు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

### నేటి నుంచి విత్తనాల పంపిణీ

మద్దికెర: రబీ సీజన్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలలోని ఆర్బీకేలకు చేరుకున్నట్లు ఏఓ రవి తెలిపారు. మండలానికి 1800 క్వింటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయని, బుధవారం నుంచి విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో విత్తనాలను అందిస్తోందన్నారు. విత్తనం క్వింటా ధర రూ.8,100 కాగా సబ్సిడీ రూ.3,240 పోను రైతు వాటా రూ.4,860 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

తుగ్గలి: సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం బుధవారం నుంచి రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని ఏఓ పవన్‌కుమార్ తెలిపారు. క్వింటాల్ పప్పుశనగ ధర సబ్సిడీ పోనూ రూ.4,860కు రైతులకు అందిస్తామన్నారు.

# ఆరోగ్య సురక్ష పేదలకు వరం

### పరీక్షలు చేసి మందులు ఇచ్చారు



డాక్టర్లు ఇంటి వద్దకే వచ్చి నా ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. బీపీ, రక్తపోటు, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. త్వరలోనే వైద్య శిబిరం నిర్వహించి నిపుణులైన డక్టర్లతో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. మాలాంటి పేద ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం సంతోషంగా ఉంది. – మహాలక్ష్మి, ఎం.అగ్రహారం

### గతంలో పట్టించుకునే వారు కాదు



గతంలో పీహెచ్‌సీ, సబ్ సెంటర్, సీహెచ్‌సీ కేంద్రాల వద్దకు వైద్యం కోసం వెళితే సరిగా పట్టించుకునే వారు కాదు. వైద్య పరీక్షల కోసం ఆస్పత్రి చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా చర్యలు తీసుకోవడం శుభపరిణామం. వైద్య సిబ్బంది పనితీరు చాలా బాగుంది. నాకు ఇంటి వద్దకే వచ్చి బీపీ, షుగర్, పరీక్షలు చేశారు. వైద్య చికిత్సలు పొందేందుకు టోకెన్ కూడా అందించారు.

– ప్రభావతి, ఆలూరు

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పేదలకు వరంగా మారింది. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఆరోగ్య, సచివాలయ సిబ్బంది వలంటీర్ల సహాయంతో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి టోకెన్లు అందిస్తున్నారు. ఈ నెల 30వ తేది నుంచి ఆయా సచివాలయాల పరిధిలో నిర్వహించే ప్రత్యేక శిబిరాలలో వీరికి వైద్య చికిత్సలు అందించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలూరుతో పాటు పెద్దహోతూరు, మొలగవల్లి గ్రామాల్లో ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసి టోకెన్లు అందించారు. ఇంటికే వచ్చి వైద్య పరీక్షలు చేస్తుండడంతో రోగులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెద్దహోతూరులో వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

హొళగుంద: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో వలంటీర్లు, ఆశా వర్కర్లు, హెల్త్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల ఆరోగ్య వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అవసరమైన వారికి అక్కడే బీపీ, షుగర్, హెచ్‌బీ తదితర పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని హొళగుంద పీహెచ్‌సీ వైద్యాధికారాలు బిందుమాధవి, న్యూటన్ తెలిపారు.

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షగా నిలుస్తుందని హాలహర్వి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జొహరాపురం, పెద్దకొత్తిలి గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు నిర్వహించే ఆరోగ్య సర్వేను హాలహర్వి వైద్యాధికారులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 31 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆరోగ్య సురక్ష క్యాంపులు ఉంటాయన్నారు. ఆయా గ్రామాల్లోని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, రోగులు, బీపీ, షుగర్ తదితర పేషెంట్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శరవేగంగా జరుగుతుంది. మంగళవారం పలు గ్రామాల్లోని ప్రజల ఇంటి వద్దకు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు వెళ్లి బీపీ, షుగర్ తదితర వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేశారు.



హొళగుందలో వృద్ధురాలికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న హెల్త్ సిబ్బంది

ఆలూరు: ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఆలూరు నియోజకవర్గం క్లస్టర్ పరిధిలోని ఆరు మండల కేంద్రాల్లో సుమారు 120 వైద్య సబ్ కేంద్రాలు ఉన్నాయి. వీటన్నింటి పరిధిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలున్న వారు 30 నుంచి ఏర్పాటు చేయనున్న శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తూ రసీదులను అందజేశారు.

మద్దికెర: ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో సర్వేను వారు పరిశీలించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ప్రకాష్‌రావ్ ఉన్నారు.



కడమకుంట్ల వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ ధరణి

తుగ్గలి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఈనెల 30న ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వేలు చేపట్టారు. పగిడిరాయి, తుగ్గలి పీహెచ్‌సీల వైద్యుల పర్యవేక్షణలో సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి ఆ కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు వారు తీసుకుంటున్న మందుల వివరాలు సేకరిస్తున్నారు. వారికి ఏ తేదీ ఎక్కడ వైద్య శిబిరం నిర్వహిస్తారనే దానిపై రశీదు అందజేస్తున్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పగిడిరాయి పీహెచ్ వైద్యులు హరిత, మినాజ్‌పాషా కోరారు.



పెద్దకొత్తిలిలో ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు



పత్తికొండలో బీపీ పరీక్ష చేస్తున్న సీహెచ్‌ఓ వసుంధర

### ఇంటి వద్దే పరీక్షలు చేస్తున్నారు



మా లాంటి వృద్ధులు ఆస్పత్రులకు నడిచి వెళ్లలేరు. డాక్టర్ల వద్ద మా రోగాలు కూడా సరిగా చెప్పలేక పోయేవాళ్లం. ఇప్పుడు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటివద్దకే వచ్చి ఆరోగ్యం గురించి వాకబు చేస్తున్నారు. బీపీ, సుగర్‌తో పాటు మరికొన్ని టెస్టులు చేశారు. ఆరోగ్య జాగ్రత్తలు చెప్పారు. 30వ తేదీ తర్వాత సమాచారం అందిస్తామని వైద్య శిబిరానికి వచ్చి డాక్టర్లతో చూపించుకుని మందులు తీసుకోవాలని చెప్పారు. దీంతో ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన బాధలు తప్పాయి.
– షమిమున్నా, ఈబీసీ కాలనీ, హొళగుంద

### ప్రజారోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ



జగన్న ఆరోగ్య సురక్ష ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోగులకు, ప్రజలకు ఇంటి వద్దనే మెరుగైన వైద్యం అందుతుంది. గత వారం రోజులగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. ప్రజారోగ్యంపై సీఎం తీసుకుంటున్న శ్రద్ధ భేష్.

– ఉరుకుందు, మొలగవల్లి,



ఆలూరులో మంచాన పడ్డ వృద్ధురాలికి వైద్య పరీక్షలను చేస్తున్న సిబ్బంది

## సచివాలయాల్లో స్పందన నిర్వహించాలి

నందవరం: ప్రతి గ్రామ సచివాలయంలో సిబ్బంది రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీఓ దశరథ రామయ్య ఆదేశించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని మాచాపురం, ఇబ్రహీంపురం, నదికైరవాడి గ్రామాలలోని సచివాలయాలను తనిఖీ చేశారు. అలాగే ప్రభుత్వ భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయపాలన, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ప్రతి రోజు సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి రిజిస్టర్లలో గ్రీవెన్స్‌ను నమోదు చేయాలన్నారు. స్పందన పట్ల నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఏజెన్సీలకు సూచించారు. సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాచాపురం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథ రామయ్య

## శిక్షణ తరగతులను పరిశీలించిన డీఈఓ

వెల్దుర్తి: మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు స్థానిక బాలుర జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను మంగళవారం డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి పరిశీలించారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి అనంతరం శిక్షణలో మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించే పద్ధతులను వివరించారు. అక్టోబర్ 3 నుంచి ప్రారంభమయ్యే ఎఫ్‌ఏ–2 పరీక్షల నిర్వహణపై తగు సూచనలిచ్చారు. అనంతరం బాలుర హైస్కూల్, బాలికల హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికల హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ.. బైజూస్ యాప్‌ను ఉపయోగించుకుని తర్ఫీదు పొందాలని సూచించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రామునాయక్, చంద్రావతి ఉన్నారు.



వెల్దుర్తిలో స్కూల్ కాంప్లెక్స్ ట్రైనింగ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తుగ్గలి: సంక్షేమంతో పాటు అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకులు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణ రెడ్డి, సర్పంచ్ మనీంద్ర అన్నారు. మంగళవారం రాంపల్లిలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు వారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీసీ రోడ్లు వేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో గడప గడపకు మన ప్రభుత్వం కింద సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షలతో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుమన్ తదితరులు ఉన్నారు.



రాంపల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

## ఈ–క్రాప్ నమోదైన పంటల పరిశీలన



యూట్యూబ్ రైతు ఛానల్‌పై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సునీత

హాలహర్వి : మండలంలోని గూళ్యం, హాలహర్వి గ్రామాల్లో మంగళవారం ఏడీఏ సునీత పర్యటించారు. పంటల నమోదు ప్రక్రియను సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలా నమోదు చేశారు, ఏ విధంగా ఈ–కేవైసీ చేస్తున్నారన్న విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. యూట్యూబ్‌లో రైతుల కోసం ప్రసారమయ్యే ఆర్‌బీకే ఛానల్ గురించి వివరించారు. ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. రబీ సీజన్‌కు గానూ శనగ విత్తనాలు మండలానికి 4550 క్వింటాళ్లు మంజూరయ్యాయన్నారు. జేజీ–11 ధర క్వింటం రూ.8,100 కాగా 40 శాతం సబ్సిడీతో రైతులకు రూ.4860కు అందుబాటులో ఉందన్నారు. అలాగే కాక్–2 లేదా కాబులి రకాలు క్వింటం ధర రూ.14,050 ఉండగా 40 శాతం సబ్సిడీతో రైతులకు రూ.8,430కు అందించనున్నట్లు చెప్పారు. ఒక్కో రైతుకు గరిష్టంగా ఐదెకరాల సాగుకు పది బ్యాగుల వరకు అందిస్తామన్నారు. ఏఓ శివశంకర్, వ్యవసాయ సిబ్బంది మనోజ్, గురుమూర్తి, ఇంద్రజ, రైతులు ఉన్నారు.

### పౌష్టికాహారం తీసుకోవాలి

ఆస్పరి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆస్పరి సీడీపీఓ నిర్మలాదేవి సూచించారు. మంగళవారం ఆస్పరి అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ మూలింటి రాధమ్మ అధ్యక్షతన పోషకాహార మాసోత్సవం సందర్భంగా గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, గుడ్లు, రాగులు, సజ్జలు వంటి ఆహార పదార్థాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం వీరికి ఇంటి వద్దకే గుడ్లు, బియ్యం తదితర వస్తువులు సరఫరా చేస్తోందన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు సునీత, పద్మావతి, శివలింగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆస్పరి సీడీపీఓ నిర్మలాదేవి

### పత్తిలో గులాబీ రంగు పురుగును నివారించాలి

గోనెగండ్ల: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఎమ్మిగనూరు వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఏఓ హేమలత సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించడానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరానికి 10 నుంచి 20 బుట్టలను అమర్చుకోవాలని సూచించారు. ఈ బుట్టల్లో వరుసగా 3 రోజుల పాటు 8 చొప్పున పురుగులు పడితే ఉధృతి తీవ్రంగా ఉన్నట్లు గుర్తించి రసాయన మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. పంట 40 నుంచి 50 రోజుల దశలో పురుగు లార్వా నివారణకు వేపనూనె పిచికారీ చేసుకోవాలన్నారు. 50 నుంచి 80 రోజుల దశలో పురుగు ఉధృతిని బట్టి 400 మి.లీ క్వినాల్‌ఫాస్ 25 ఇ.సీ. లేదా 500 మి.లీ క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి. లేదా 250 మిల్లీ లీటర్ల పిరిడాలిల్ మందులను 200 లీటర్ల నీటికి కలుపుకొని ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. పంట ఆఖరి దశలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే సింథటిక్ పైరిథ్రాయిడ్ మందులైన సైపర్ మెత్రిన్ 25 ఇ.సి. 200 మి.లీ. లేదా లాంబ్డాసైహలోత్రిన్ 5 ఇ.సి. 200 మి.లీ లేదా క్లోరాంట్రనిలిప్రోల్, లాంబ్డాసైహలోత్రిన్ 100 మి.లీ లేదా బైఫెన్‌త్రిన్ 10 ఇ.సి 320 మి.లీ చొప్పున 200 లీటర్ల నీటికి కలుపుకొని ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

### వృద్ధుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

నందవరం: మండల పరిధిలోని కోసిగి రోడ్డు వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. మంగళవారం పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. సదరు వృద్ధుడు కొంతకాలంగా ఎమ్మిగనూరు టౌన్‌లోని కమిటీ జంక్షన్, శ్రీనివాస సర్కిల్ వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మంగళవారం ఉదయం ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వెళ్లే రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా తిక్కారెడ్డి పొలం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ఇతడి ఆచూకీ తెలిసిన వారు 91211 01150, 94417 59770 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

### బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆదోని డీఎస్పీ కార్యాలయ సమీపంలో మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు స్కూటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో చంద్రకాంత్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎమ్మిగనూరులో అమెజాన్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న చంద్రకాంత్ పని ముగించుకొని ఆదోనిలోని భార్యను చూడటానికి వెళ్తున్నాడు. ఆదోని నుంచి కర్నూలువైపు వెళ్తున్న ఏపీ 21 జెడ్ 0716 నెంబర్ గల కర్నూల్–2 డిపో బస్సు ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో చంద్రకాంత్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

### సబ్సిడీ విత్తనాల మంజూరు

చిప్పగిరి: మండలానికి 5,950 క్వింటాళ్ల సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు మంజూరైనట్లు ఏఓ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. శనగ విత్తనాల మార్కెట్ ధర క్వింటాలుకు రూ.8,100 కాగా ప్రభుత్వం 40 % రాయితీ కల్పించిందని రైతులు క్వింటాలుకు రూ.4,860 చెల్లించి విత్తనాలు పొందవచ్చన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు స్థానిక ఆర్బీకేల్లో పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

## భక్తితో పులకించిన పుట్లూరు

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో వెలసిన శ్రీమాతా మారెమ్మ బ్రహ్మోత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. మంగళవారం గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి మొక్కులు తీర్చుకునేందుకు చుట్టుపక్కల గ్రామాలు, జిల్లాలు, రాష్ట్రాలనుంచి తరలి వచ్చిన భక్తులతో గ్రామం కిక్కిరిసింది. ఎస్‌ఐ సురేశ్ బందోబస్తు నిర్వహించారు.

**నేడు, ఎల్లుండి బండలాగుడు పోటీలు**

27న బుధవారం పాల పళ్ల విభాగంలో రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు. రూ.12 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే 29న శుక్రవారం సీనియర్స్ విభాగంలో బండలాగుడు పోటీలున్నాయన్నారు. విజేతలకు వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు అందిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వృషభ యజమానులు 86393 63721, 75693 90793 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామానికి చెందిన జెడ్పీ పాఠశాల విద్యార్థులు సోమవారం కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గౌరమ్మ తెలిపారు. అండర్–17 హాకీ పోటీల్లో బాలికల విభాగంలో స్వాతి, భార్గవి, అఖి, బాలుర విభాగంలో శివ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే అండర్–14 బాలికల విభాగంలో అనసూయ, రూప, బాలుర విభాగంలో రవీంద్ర ఉత్తమ ప్రతిభ చూపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, పీడీ ఈరన్న, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

దేవనకొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు ఎస్‌టీబీటీ కళాశాల గ్రౌండ్స్‌లో జరిగిన జిల్లాస్థాయి హాకీ అండర్–17 పోటీల్లో తెర్నెకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉదయ్‌కుమార్, వీరకుమార్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులను, పీఈటీ వీణను స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.డి.ఎస్.జ్యోతి ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన కనకవీడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఆలూరులో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బుడగ జంగం కులస్తులు

ఆలూరు రూరల్: బుడగ జంగం కులస్తులను షెడ్యూల్డ్ జాబితాలో తిరిగి చేర్చాలని ఏపీ అసెంబ్లీలో మంగళవారం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడంతో స్థానిక బుడగ జంగం కులస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఆలూరు కోయనగర్ కాలనీలోని స్థానిక పీర్ల చావిడి ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేసీ శర్మ కమిషన్ నివేదిక ఆధారంగా బుడగ జంగం కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం సంతోషదాయకం అన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని బుడగ జంగం బిల్లు తీర్మానం చేసి లోక్‌సభకు పంపించారని చెప్పారు. బిల్లు ఆమోదం పొందితే ఇకపై అన్ని రంగాల్లో తమకు అవకాశం లభిస్తుందన్నారు. ఎంపీటీసీ మోతి యల్లమ్మ, సంఘం నాయకులు సుంకన్న, ఆదెప్ప, మారెప్ప, మారెక్క, గజ్జలప్ప తదితరులు ఉన్నారు.

### క్రీడల్లో రాణించాలి

పత్తికొండటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ మస్తాన్‌వలి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేశప్ప సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అట్టహాసంగా ప్రారంభయ్యాయి. ఎంఈఓ మస్తాన్‌వలి, ప్రిన్సిపాల్ వీరేశప్ప ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ అండర్–14, అండర్–17 బాలురు, బాలికల విభాగం కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ క్రీడలలో టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎంలు మాలతి, వెంకమ్మ, స్కూల్ గేమ్స్ ఇన్‌చార్జ్‌లు చందూనాయక్, రంగస్వామి, ఫిజికల్ డైరెక్టర్లు మధు, పాండు, వేణు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్కూల్‌గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి, ప్రిన్సిపాల్ వీరేశప్ప